క్లుప్తంగా

పెరుగుతున్న వరద



బూరుగులంక రేవులో పడవపై వెళ్తున్న లంక గ్రామాల ప్రజలు

పి.గన్నవరం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో మండలంలోని నదీపాయల్లో వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వరద ఉధృతి పెరగడంతో మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెల వారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు.

తొగరపాయలో ఉధృతి

అయినవిల్లి: ముక్తేశ్వరం తొగరపాయలోకి మరోసారి వరద పోటెత్తింది. తొగరపాయలో వరద ప్రవహించడంతో పాత వంతెనను వరద తాకింది. ముక్తేశ్వరం-కోటిపల్లిరేవులో నీటిమట్టం పెరిగింది. లంక గ్రామాల్లో ఉన్న పశువులను సురక్షిత ప్రాంతాలకు రైతులు తరలిస్తున్నారు. మండలంలోని వీరవల్లిపాలెం, శానపల్లిలంక, పొట్టిలంక, కొండుకుదురులంక, చింతనలంక, మడుపల్లిలంకలోని పల్లపు పొలాల్లోకి వరద చేరింది.

ఏడీఏగా సీహెచ్‌కేవీ చౌదరి



ఆలమూరు: స్థానిక వ్యవసాయశాఖ సబ్ డివిజన్ సహాయ సంచాలకుడు (ఏడీఏ)గా సీహెచ్‌కేవీ చౌదరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. గత నెలలో అప్పటి వరకూ పనిచేసిన ఏడీఏ కాకి నాగేశ్వరరావు ఉద్యోగ విరమణ చేయడంతో ఈ పోస్టుకు ఖాళీ ఏర్పడింది. దీంతో వ్యవసాయశాఖలో ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా రంపచోడవరం ఏడీఏగా పనిచేసిన చౌదరి బదిలీపై స్థానిక ఏడీఏ కార్యాలయానికి వచ్చారు. గతంలో స్థానిక సబ్ డివిజన్‌లో మండల వ్యవసాయాధికారిగా, సహాయ సంచాలకుడిగా పనిచేసిన అనుభవం ఉంది. రైతులందరికీ అత్యుత్తమ సేవలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని ఏడీఏ పేర్కొన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస నగేష్

సఖినేటిపల్లి: మండలంలోని టేకిశెట్టిపాలేనికి చెందిన బీజేపీ సీనియర్ లీడర్ మాలే శ్రీనివాస నగేష్, ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా శనివారం నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ నుంచి నియామక ఉత్తర్వులు వచ్చినట్టు నగేష్ మీడియాకు తెలిపారు. కాగా 1986లో పార్టీలోకి సాధారణ కార్యకర్తగా ప్రవేశించిన ఆయన, వివిధ స్థాయిల్లోని పదవులను చేపట్టారు.

గ్రామీణరోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం

రాజోలు: గ్రామీణ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శనివారం కాట్రేనిపాడు నుంచి పొన్నమండ వరకు రూ.1.28 కోట్ల నాబార్డు నిధులతో నిర్మించనున్న రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ గతంలో కాట్రేనిపాడులంక రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. దశలవారీగా రోడ్డు నిర్మాణ పనులు చేపడతామన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ అడబాల శ్రీనివాస్, గుండుబోగుల పెద్దకాపు, అడబాల చంటి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలి



మార్కెట్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మామిడికుదురు: నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్ పెనుమాల లక్ష్మి అధ్యక్షతన శనివారం పాలకవర్గ మొదటి సమావేశం జరిగింది. మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలందించే దిశగా కార్యాచరణ చేపట్టాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు సేవలందించడమే లక్ష్యంగా పని చేస్తామని చైర్మన్ లక్ష్మి తెలిపారు. మే నెలలో రూ.14.13 లక్షలు, జూన్ నెలలో రూ.9.49 లక్షలు ఆదాయం వచ్చిందని మార్కెట్ కమిటీ కార్యదర్శి జి.ప్రదీప్ తెలపారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అప్పనపల్లిలో శ్రావణ శోభ

మామిడికుదురు: బాలబాలాజీ స్వామి ఆలయానికి శనివారం భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ అనంతరం తొలి హారతితో దర్శనాలు ప్రారంభమయ్యాయి. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామి వారికి తలనీలాలు సమర్పించారు. స్వామికి వివిధ సేవల ద్వారా రూ.2,40,081 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ వి.సత్యనారాయణ తెలిపారు.

చంద్రబాబు మోసపు హామీలపై నిలదీద్దాం

- బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీపై విస్తృత ప్రచారం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి వెల్లడి



ఆలమూరులో చంద్రబాబూస్ మ్యానిఫెస్టో' క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి తదితరులు



పెదపట్నంలంకలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న పి.గన్నవరం కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు

ఆలమూరు: బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీగా మారిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలోనే అన్ని విధాలుగా వైఫల్యం చెందిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన ఆలమూరులో శనివారం బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం జరిగింది. స్థానిక మెయిన్‌రోడ్డులోని వినాయక కన్వెన్షన్ హాల్‌లో మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు సిరిపురపు శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొనగా భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివచ్చారు. జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసగించిందని ఎద్దేవా చేశారు. పార్టీ శ్రేణులంతా ప్రజల్లోకి వెళ్లి కూటమి ప్రభుత్వంలో తూతూ మంత్రంగా అమలు చేస్తున్న పథకాలను ప్రచారం చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కల్పన, ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీలను అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపుతుందన్నారు. చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలు వివరించే 'రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో' క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను స్థానిక పార్టీ నేతలతో కలసి జగ్గిరెడ్డి ఆవిష్కరించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఇసుక, మద్యంలో అవినీతికి పాల్పడుతూ వీధి వీధికి బెల్ట్ షాపులను ఏర్పాటు చేసి పేదలను పీడిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీలు తోరాటి సీతామహాలక్ష్మి, కుడుపూడి శ్రీనివాసు, వైస్ ఎంపీపీ నేలపూడి రత్నకుమారి, సర్పంచ్ నేలపూడి లావణ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, నెక్కంటి వెంకటరాయుడు, నామాల శ్రీనివాసు, నాంద్ర నాగమోహన్ రెడ్డి, యు.సుందర విజయం తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగానికి విరుద్ధంగా పాలన

మామిడికుదురు: భారత రాజ్యాంగానికి విరుద్ధంగా పాలన జరుగుతోందని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గం కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం శనివారం పెదపట్నంలంక, బి.దొడ్డవరం, నగరం, మొగలికుదురు గ్రామాల్లో జరిగింది. మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము అధ్యక్షతన జరిగిన రచ్చబండలో కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి మాట్లాడారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని వైఎస్సార్ సీపీ నేతలపై తప్పుడు కేసులు బనాయించడం తప్ప ఇచ్చిన హామీలను అమలు చేయాలన్న ధ్యాస కూటమి నేతల్లో ఎక్కడా కనిపించడం లేదన్నారు. అందరికీ సంక్షేమ పథకాలు ఇచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నేతలు రాయుడు ఆనంద్, కేదారశెట్టి మల్లి, కడలి శ్రీనివాస్, తాడి శేఖర్, పార్టీ నేతలు జక్కంపూడి వాసు, తులా గోపాలకృష్ణ, పిచ్చుక చిన్న, గెడ్డం ఏసుదాసు, మొల్లేటి త్రిమూర్తులు, అన్వర్ తాహిర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీ ఆగడాలను ప్రశ్నిస్తే తప్పుడు కేసులు

- రేపటి నుంచి బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ సభలు
- పాల్గొనాలని పార్టీ శ్రేణులకు కోఆర్డినేటర్ల ఆదేశాలు



సఖినేటిపల్లి మూడుతూములు సెంటర్లో బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ సన్నాహక సమావేశంలో పాల్గొన్న గొల్లపల్లి సూర్యారావు, మట్టపర్తి నాగేంద్ర

రాజోలు: అధికార పార్టీ ఆగడాలను ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శనివారం సోంపల్లిలో మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు స్వగృహం వద్ద ఆ గ్రామ వైఎస్సార్ సీపీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాజోలు నియోజకవర్గ పరిశీలకుడు మట్టపర్తి నాగేంద్ర, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావుల సమక్షంలో సోంపల్లి గ్రామశాఖ అధ్యక్షుడిగా జిల్లెళ్ల వినోద్ బాబు, ప్రధాన కార్యదర్శులుగా బొమ్మిడి సత్యనారాయణ, కట్టా మురళీమోహన్ ఎన్నికయ్యారు. నియోజకవర్గ పరిశీలకుడు నాగేంద్ర మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందన్నారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నిర్విఘ్నంగా గ్రామకమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మాజీ మంత్రి గొల్లపల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అరాచకాలను నిలదీసే ఏకైక నాయకుడు మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఒక్కరేనన్నారు. లేనిపోని హామీలను గుప్పించి వాటిని అమలు చేయలేక రాష్ట్రాన్ని అమ్మివేయాలని ఒక మంత్రి అనడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. మేనిఫెస్టోని ఒక పవిత్రగ్రంథంగా భావించి ప్రజలకు ఇచ్చిన హామీను నెరవేర్చిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. నూతనంగా ఎన్నికైన గ్రామకమిటీ కార్యవర్గ సభ్యులను మాజీ మంత్రి గొల్లపల్లి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు. మండపేట నియోజకవర్గ పరిశీలకుడు కటకంశెట్టి ఆదిత్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లాబత్తుల సతీష్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు కూనపరెడ్డి రాంబాబు, వలంటీర్ విభాగం అధ్యక్షుడు ఉచ్చుల దాసు, నాయకులు గుర్రం జాషువా, ఉచ్చుల విష్ణు, కొంబత్తుల బాలయోగి, బొడ్డపల్లి ప్రసాద్, పిండి నాయుడు, కట్టా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ సభలు

అంబాజీపేట: కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ఎంటగట్టేందుకు ఈ నెల 28 నుంచి ఆగస్టు 8వ తేదీ వరకు మండలంలోని 16 గ్రామాల్లో బాబు ష్యూరిటీ... మోసం గ్యారంటీ సభలను నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమాలకు పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొనున్నారన్నారు. 28న పసుపల్లి, వక్కలంక, కముజువారిలంక, ముక్కామల, ఇరుసుమండ, ఆగస్టు 1న పుల్లేటికుర్రు సచివాలయాలు 1, 2, 3, మొసలపల్లి, కె.పెదపూడి, 5న ఇసుకపూడి, చిరతపూడి, గంగలకుర్రు, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, 8న వాకలగరువు, తొండవరం, నందంపూడి, మాచవరం సచివాలయాలు 1,2, 3, 4లలో రచ్చబండ కార్యక్రమాలను నిర్వహించి కూటమి ప్రభుత్వం మోసాలను ప్రజలకు వివరించనున్నామన్నారు. ఈ రచ్చబండ కార్యక్రమానికి మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ హోదాల్లో ఉన్న ప్రతీ ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: ఎన్నికల్లో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి వాటిని విస్మరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు మోసాలపై రానున్న ప్రజా క్షేత్రంలో కూటమికి ప్రజలు భరతం పట్టే రోజులు రానున్నాయని వైఎస్సార్ సీపీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు, రాజోలు అబ్జర్వర్ మట్టపర్తి నాగేంద్ర అన్నారు. శనివారం సఖినేటిపల్లి మూడుతూములు సెంటర్లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్ ఇంటి వద్ద ఆయన అధ్యక్షతన సోమవారం మండల స్థాయిలో నిర్వహించే బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమం సన్నాహక సమావేశం జరిగింది. సమావేశంలో గొల్లపల్లి మాట్లాడుతూ, బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ ద్వారా ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన వాగ్దానాలను, ఎన్నికల అనంతరం ప్రజలను ఎలాంటి మోసాలకు గురిచేస్తోందో ప్రజలకు తెలియజేసే విధంగా పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని సూచించారు. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తూ వారికి ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి తూట్లు పొడిచే పనిలో పాలన ఉందన్నారు. రాజోలు నియోజకవర్గ అబ్జర్వర్ మట్టపర్తి నాగేంద్ర మాట్లాడుతూ, మండలంలోని ప్రతి గ్రామం నుంచి విధిగా కార్యకర్తలు, నాయకులు తరలి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల పార్టీ నాయకులు నల్లి త్రిమూర్తులు, తోటె జాన్‌బాబు, తాడి సహదేవ్, ఈద రవిరెడ్డి, కటకంశెట్టి ఆదిత్య, జె.ఉదయ కిరణ్ పాల్గొన్నారు.

నేడు కె.జగన్నాథపురంలో..

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురం, తొత్తరమూడి, శానపల్లిలంక గ్రామాల్లో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం ఆదివారం నిర్వహిస్తున్నట్లు పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మేడిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆస్పత్రి అభివృద్ధికి ఓఎన్జీసీ నిధులు తీసుకువస్తా

పి.గన్నవరం: స్థానిక సీహెచ్‌సీలో మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలు, పాత పీహెచ్‌సీ భవనం మరమ్మతులకు ఓఎన్జీసీ నుంచి రూ.కోటి మేర నిధులు తీసుకువస్తానని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ వెల్లడించారు. ఆస్పత్రి అభివృద్ధికి ఏమేమి అవసరమో, వాటికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వైద్యాధికారులను ఆయన ఆదేశించారు. దివంగత పారిశ్రామిక వేత్త తాడి తాతారావు జ్ఞాపకార్థం నాగుల్లంకకు చెందిన అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ భీమాల వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు రూ.7.5 లక్షలతో ఆస్పత్రి ప్రాంగణంలో నిర్మించిన డైనింగ్ హాల్ భవనాన్ని, కె.ఏనుగుపల్లికి చెందిన సూదా సూర్యప్రకాశరావు, అనంతలక్ష్మి దంపతులు రూ.2.5 లక్షల వ్యయంతో నిర్మించిన విశ్రాంతి భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. సూదా అంజిబాబు, సూదా రాంబాబుల జ్ఞాపకార్థం పి.గన్నవరానికి చెందిన గణపతి తాతాజీ ఆర్థిక సాయంతో కొనుగోలు చేసిన ఏసీని ఎమ్మెల్యే చేతుల మీదుగా సీహెచ్‌సీ సూపరింటెండెంట్ యు.రాఘవేంద్రరావుకు అందజేశారు. విశ్రాంత ఏఎస్ఐ గుమ్మరేగుల సత్యనారాయణ ఏర్పాటు చేసిన అబ్దుల్‌కలాం విగ్రహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. వైద్య సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు కాకపోతే ఊరుకునేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఆస్పత్రి కమిటీ సభ్యులు కోట రాజేంద్ర ప్రసాద్, గుడాల సంపదరావు, పితాని నాగలక్ష్మి, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరావు, భీమాల వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, సాధనాల జేడీ, శేరు శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గ్రామ నూతన కార్యవర్గం ఎంపిక



అంతర్వేదిపాలెం వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ నూతన కార్యవర్గంతో నాయకులు

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదిపాలెం గ్రామ శాఖ వైఎస్సార్ సీపీ నూతన కార్యవర్గ ఎంపిక శనివారం జరిగింది. ఆ పార్టీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు సూచనలతో మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్ పర్యవేక్షణలో మాజీ సర్పంచ్ నల్లి సురేంద్ర అధ్యక్షతన ఈ ఎంపిక నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా నల్లి త్రిమూర్తులు, ప్రధాన కార్యదర్శిగా కె.చిట్టిబాబు ఎన్నుకున్నారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చినరాజా, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రతినిధి తాడి సహదేవ్, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు దొంగ ఏసు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈద రవిరెడ్డి, లీగల్ సెల్ అధ్యక్షుడు దివ్వి చిట్టిబాబు, జిల్లా ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు తోటె జాన్‌బాబు, నాయకులు మందపాటి సత్యనారాయణ, మోకా ఏసురాజు, కోనపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



ఆలమూరు మండల నూతన కమిటీతో జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాసరావు

ఆలమూరు: స్థానిక వినాయక కన్వెన్షన్ హాలులో నియోజకవర్గ పరిశీలకుడు సిరిపురపు శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల విస్తృత స్థాయి సమావేశంలో మండల వైఎస్సార్ సీపీ కమిటీని ప్రకటించారు. సామాజిక సమతుల్యతను పాటిస్తూ అణగారిన వర్గాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మండలంలో 22 మందితో ఏర్పాటు చేసిన ఈ మండలస్థాయి కమిటీ నియామకంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివచ్చి నూతన కమిటీకి అభినందనలు తెలియజేశారు. మండల కన్వీనర్‌గా తమ్మన శ్రీనివాసు (చెముడులంక), ఉపాధ్యక్షులుగా జుత్తుక శ్రీనివాసు (పెనికేరు), అయినవిల్లి అర్జున (మడికి), ప్రధాన కార్యదర్శులుగా వనుం సూరిబాబు, తాడి మెహెర్ ఆదిత్యరెడ్డి, జాంప్రోలు మాణిక్యం, ర్యాలి గోవిందు, కార్యదర్శులుగా బాలిన సూర్యనారాయణ, తోరాటి గోవిందు, వి.సుధాకర్, కడలి దుర్గారావు, కంబాల సురేష్, నియమితులయ్యారు. అలాగే సభ్యులుగా పాతుపూరి సూరయ్య, అవిడి నాగేశ్వరరావు, నాగిరెడ్డి సాయి, మోదుకూరు సతీష్, పరమట రాంబాబు, విశ్వనాథుల వీరభద్రరావు, వి.వెంకటస్వామి, గోపి నాగేశ్వరరావు, కఠారి గంగరాజు, పిల్లి ధనరాజు ఎంపికయ్యారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు చేసేందుకు నిరంతరం పోరాటం చేస్తామని, అలాగే వైఎస్సార్ సీపీ పటిష్టతకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని నూతన కమిటీ తెలిపింది.

జీవన ఎరువుల వినియోగంతో పెట్టుబడి ఆదా

కొత్తపేట: వ్యవసాయ, ఉద్యాన పంట సాగులో రసాయన ఎరువుల వాడకం క్రమేపీ తగ్గించి, జీవన ఎరువులు (బయో ఫెర్టిలైజర్స్) వినియోగం పెంచడం ద్వారా పెట్టుబడి గణనీయంగా తగ్గించుకోవాలని వ్యవసాయ శాఖ స్థానిక సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఏ) ఎం.వెంకటరామారావు రైతులకు సూచించారు. రసాయన ఎరువులు తగ్గించి జీవన ఎరువుల వినియోగం పెంచాలని కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా జీవన ఎరువుల ఉత్పత్తి కేంద్రాల ద్వారా సరఫరా అవుతున్న ఎరువులను వ్యవసాయ శాఖ రైతుల్లోకి తీసుకువెళుతుంది. దానిలో భాగంగా సామర్లకోట బయో ఫెర్టిలైజర్స్ ఉత్పత్తి కేంద్ర ద్వారా సరఫరా అయిన ఫాస్ఫో బాక్టీరియా (పీఎస్‌బీ), పొటాషియం మొబిలైజింగ్ బాక్టీరియా (కేఎంబీ)లను ఏడీఏ శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంతో ప్రదర్శించారు. వాటిని రైతుల్లోకి తీసుకువెళ్లే అంశంపై ఏడీఏ సబ్ డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయ అధికారులు (ఏఓ)తో సమీక్షించారు. రూ.150 విలువైన 500 మిల్లీలీటర్లు ఫాస్ఫో బాక్టీరియా రూ.520 విలువైన 50 కేజీల సూపర్ బస్తాతో సమానమని, అలాగే రూ.150 విలువైన 500 మిల్లీలీటర్ల పొటాషియం మొబిలైజింగ్ బాక్టీరియా రూ.1,800 విలువైన 50 కేజీల పొటాష్‌తో సమానమని వివరించారు. ఈ జీవన ఎరువులు అన్ని పంటలకు వినియోగించవచ్చని తెలిపారు. ఈ ఎరువులు వాడకాన్ని పెంచుకుంటూ వెళ్లడం వలన పంటల సాగుకు పెట్టుబడి తగ్గి క్రమేపీ పంటల దిగుబడులు పెరుగుతాయన్నారు. సమావేశంలో జె.భార్గవమహేష్, ద్వారాకాదేవి, లక్ష్మీలావణ్య, ఏఈఓ కోలా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కలాం సేవలు చిరస్మరణీయం

పి.గన్నవరం: మాజీ రాష్ట్రపతి, దివంగత అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో కలాం విగ్రహానికి శనివారం విప్పర్తి, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విప్పర్తి మాట్లాడారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ భీమాల వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.



పి.గన్నవరంలో కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న విప్పర్తి, పాముల →

విజయవంతంగా కుట్టు శిక్షణ పూర్తిచేయాలి

కొత్తపేట: మహిళలు స్వయం ఉపాధి పొందుతూ కుటుంబానికి ఆర్థికంగా తోడ్పడాలనే లక్ష్యంతో ప్రభుత్వం కల్పించిన ఉచిత కుట్టు శిక్షణను విజయవంతంగా పూర్తిచేయాలని ఎంపీడీఓ పీఎస్ నరేష్ కుమార్ మహిళలకు సూచించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలోని రైతు సేవా కేంద్ర భవనంలో రెండు నెలలుగా నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణా కేంద్రంలో రెండు బ్యాచ్‌లుగా 100 మంది మహిళలు శిక్షణ పొందుతున్నారు. ఈ శిక్షణ వచ్చే నెల 9తో ముగియనుంది. ఆ కేంద్రాన్ని శనివారం ఎంపీడీఓ నరేష్‌కుమార్, బీసీ కార్పొరేషన్ అధికారులు సందర్శించారు. మహిళలు శిక్షణ పొందుతూ కుట్టిన డ్రెస్‌లను పరిశీలించారు. శిక్షణలో వారి అనుభవాన్ని, జీవితంలో ఉపాధికి, కుటుంబ ఆర్థిక తోడ్పాటుకు శిక్షణ ఏ మేరకు దోహదపడుతుంది వంటి అంశాలను ఆయన ఆరా తీశారు. సెంటర్‌లో మహిళలకు కల్పించిన వివిధ సౌకర్యాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మోడల్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, దానిలో భాగంగా శారీస్, బ్లౌజ్‌లు, వివిధ డ్రెస్‌ల డిజైన్ల కుట్టుకు మంచి డిమాండ్ ఉందన్నారు. అన్ని రకాల మోడల్ స్టిచింగ్స్‌లో ఆరితేరి, మోడల్ టైలర్లుగా రాణిస్తూ ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సూచించారు.

కుట్టుశిక్షణ కేంద్రం పరిశీలన

ఆలమూరు: స్థానిక స్త్రీశక్తి భవనంలో కొనసాగుతున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎంపీడీఓ ఎ.రాజు శనివారం పరిశీలించారు. కుట్టు శిక్షణ నేర్చుకున్న మహిళలను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత కాలంలో శిక్షణను పూర్తి చేసి టైలరింగ్ ద్వారా జీవనోపాధిని పొందాలని సూచించారు. కుట్టు శిక్షణ పూర్తయ్యిన మహిళలకు ప్రభుత్వం అందించబోయే రాయితీల వివరాలను తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు

రాజోలు: క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని అమెరికా ఇంటెల్ కంపెనీ ఉన్నత ఉద్యోగి కడలి శ్యామ్‌బెనగళ్ అన్నారు. శనివారం రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2022-25 డిగ్రీ విద్యార్థుల ఫేర్‌వెల్ సంబరాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశం జరిగింది. ప్రభుత్వ కళాశాలలో విద్యను అభ్యసించి అనేక మంది ఎంతో ఉన్నతంగా స్థిరపడ్డారన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. ఫేర్‌వెల్ సంబరాల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, పీఆర్వో నల్లి రాజు, శైలజ, రిటైర్డ్ ఎంఈఓ జొన్నలగడ్డ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆండాళ్ అమ్మవారి వర్ష తిరునక్షత్ర పూజలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ఆండాళ్ అమ్మవారి వర్ష తిరు నక్షత్రం పూజలు అర్చకులు ప్రారంభించారు. సోమవారం వరకూ జరిగే ఈ పూజలు నిమిత్తం ఆండాళ్ అమ్మవారిని స్వామివారి సన్నిధిలో వేదికపై అర్చకులు ఆశీనులు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకులు విశేష పూజలకు శ్రీకారం చుట్టారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

మ్యాచింగ్ కంట్రిబ్యూషన్ కోసం దాతలకు వినతి

సఖినేటిపల్లి: అంతర్వేదిలో కొలువైన లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న నీలకంఠేశ్వరస్వామివారి ఆలయ పునర్నిర్మాణం కోసం దాతలు విరాళాలు సమర్పించాలని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ శనివారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు. ఆలయం పూర్తి స్థాయిలో పునర్నిర్మాణం, ఇతర పనులకు గాను కామన్ గుడ్ ఫండ్ నుంచి దేవదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల ద్వారా మొత్తం రూ.3.50 కోట్లు మంజూరైనట్టు ఆయన చెప్పారు. ఈ క్రమంలో మ్యాచింగ్ కంట్రిబ్యూషన్ నిమిత్తం విరాళాలు చెల్లించే దాతలు, భక్తులు లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కార్యాలయంలో చెల్లించి తగిన రశీదులు పొందాలని ఆ ప్రకటనలో ఏసీ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

చేనేత సొసైటీలకు త్రీమెన్ కమిటీలు వేయాలని వినతి

సఖినేటిపల్లి: చేనేత సొసైటీలకు త్రీమెన్ కమిటీలు వేసి కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ మోరి చేనేత సొసైటీ మాజీ అధ్యక్షుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ చింతా వీరభద్రేశ్వరరావు, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను శనివారం కోరారు. మండపేట నియోజకవర్గంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి వచ్చిన మంత్రిని కలిసి వినతిపత్రాన్ని వీరభద్రేశ్వరరావు అందజేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మోరి, అంగర, నేలటూరు, మండపేట, నల్లూరు, ఏడిద, రాయవరం గ్రామాల నుంచి 20 మంది చేనేత ప్రతినిధులతో కలిసి పై వినతిపత్రం ఇచ్చామని వీరభద్రేశ్వరరావు పేర్కొన్నారు.

కార్గిల్ అమరవీరులకు విద్యార్థుల నివాళి

మామిడికుదురు: కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని మామిడికుదురు దీప్తి స్కూల్ విద్యార్థులు శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఆర్మీ దుస్తులు ధరించి త్రివర్ణ పతాకాలు పట్టుకుని కొవ్వొత్తులు వెలిగించి కార్గిల్ యుద్ధంలో అసువులు బాసిన అమర వీరులకు సెల్యూట్ చేశారు. స్కూల్ కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ యక్కలదేవర నాగన్నబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పాకిస్తాన్ సేనలను మట్టి కరిపించిన సేనలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

మామిడికుదురు: విద్యార్థులు ఇష్టపడి చదువుకుని తాము అనుకున్న లక్ష్యాలకు చేరుకోవాలని సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు సూచించారు. పాశర్లపూడిలంక జెడ్పీహెచ్ స్కూల్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన హస్త కళలపై అవగాహన సదస్సు శనివారం ముగిసింది. విద్యార్థులకు ఏర్పాటు చేసిన రాత పరీక్ష, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు సర్పంచ్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. హెచ్ఎం ఎన్.శ్రీదేవి అధ్యక్షతన సమావేశం జరిగింది. రాత పరీక్షలో గంటి ప్రణవి, ఎ.సాయితేజశ్విని, సీహెచ్ సాయి దీపిక, డ్రాయింగ్ పోటీల్లో సీహెచ్ నందిని, జి.రేణుక, టి.రాజేశ్వరి బహుమతులు సాధించారు.

త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారం

కొత్తపేట: మండలంలోని రాకుర్తివారిపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం శనివారం నిర్వహించారు. కమిటీ చైర్మన్‌గా బొక్కా వెంకటకుమార్, సభ్యులుగా గొలకోటి సూర్యనారాయణ (ఏసు), గన్నవరపు చిన్నజోజి నియమితులయ్యారు.

రాష్ట్రాభివృద్ధికి శ్రమిస్తున్నాం

రావులపాలెం: రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పయనింప చేసే దిశగా అహర్నిశలు శ్రమిస్తోందని రాష్ట్ర రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మండలంలోని గోపాలపురంలో శనివారం స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలసి పర్యటించారు. సుమారు రూ.3.05 కోట్లతో పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: మందపల్లిలో శనైశ్చర స్వామిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. దేవస్థానం ఈఓ దారపురెడ్డి సురేష్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది సౌకర్యాలను పర్యవేక్షించారు. టిక్కెట్లు, వివిధ సేవల ద్వారా రూ.1,52,388 ఆదాయం వచ్చినట్టు ఈఓ తెలిపారు.